హరిహర
ప్రీమియర్ లీగ్
సీజన్--4
విజేతగా హరిహర
లయన్స్ 4

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559 తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com netivelugu63@gmail.com




నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 181 | పేజీలు : 8 | అక్టోబర్ 13 మంగళవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 181 | PAGES:8 | TUESDAY OCTOBER 13 2026 | Rs. 4:00

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు: కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

**కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్**

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ూ×=) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు–బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు–గిరిజనులు–బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## 'ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది'..



**నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ హోదాను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందించారు. ఇప్పుడు దేశమంతా 'జంతర్ మంతర్' అవుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'వారు (కేంద్రం) జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన స్థలం జాబితా నుంచి తొలగించారు. అవును, అది ఇకపై నిరసన స్థలం కాదు. ఏదేమైనా ఒక పిరికి నియంత దానిని యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది' అని అందులో పేర్కొన్నారు. అలాగే, ఈ రోజు జంతర్ మంతర్‌కు ఉన్న 'నిరసన ప్రదేశం' హోదాను ప్రధాని మోదీ రద్దు చేశారని, రేపు ఆయన ప్రజాస్వామ్యాన్నే రద్దు చేస్తారని మరో పోస్ట్‌లో మండిపడ్డారు. 'ఆ నియంతకు అసలు సమస్య నిరసన ప్రదేశం కాదు. ప్రజలు నిరసన తెలపడం అనే భావనే ఆయనకు సమస్య' అని విమర్శించారు.కాగా, జంతర్ మంతర్‌ను నిరసనలకు నిర్దేశిత ప్రదేశంగా గుర్తించే హోదాను

(మిగతా 2వ పేజీలో..)

## 'సింహాసనం ఖాళీ చేయండి.. ప్రజలు వస్తున్నారు'.. శశి థరూర్ సంచలన పోస్ట్!



**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్**

**దినకర్ కవితలోని ప్రసిద్ధ పంక్తులను పంచుకున్న శశి థరూర్**

**'ఈ ప్రభుత్వం దిగిపోతుంది' అన్న రాహుల్ వ్యాఖ్యను షేర్ చేసిన థరూర్**

**అక్టోబర్ 10 నాటి నిరసనల్లో హింస జరిగిందని ప్రతిపక్షాల ఆరోపణ**

**ఢిల్లీలో ర్యాలీకి సిద్ధమైన ఇండియా కూటమి**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కూడా ఆ స్వరాన్ని వినిపించారు. ప్రముఖ హిందీ కవి రామ్‌ధారీ సింగ్ దినకర్ రచించిన 'జనతంత్ర్ కీ జన్మ్' కవితలోని ప్రసిద్ధ పంక్తులను సోమవారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'సింహాసన్ ఖాళీ కరో కీ జనతా ఆతీ హై' అంటూ ప్రజల శక్తిని గుర్తుచేసే వ్యాఖ్యను

(మిగతా 2వ పేజీలో..)

## ఇది ఓట్ల దొంగతనమే: మంత్రి శ్రీధర్ బాబు



**ఓటర్ల జాబితా సవరణపై ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన**

**ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, నేతలు**

**సీఈసీని తొలగించాలని డిమాండ్**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియకు వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి

(మిగతా 2వ పేజీలో..)

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

**ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష**

**త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం**

**ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు**



హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?: ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా

(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్.. టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

**రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలంటూ రాజగోపాల్ రెడ్డి ఆరోపణ**

**సీఎం రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయట పడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు



(మిగతా 2వ పేజీలో..)

## ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

**ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో పిటిషన్**

**రాహుల్ గాంధీ సహా 11 మంది 'ఇండియా' కూటమి నేతల పిటిషన్**

**ఓటర్లను భారీగా తొలగించారని, అవకతవకలు జరిగాయని ఆరోపణ**

**విపక్షాల ఆరోపణలు నిరాధారమంటూ బీజేపీ ఎదురుదాడి**



కేంద్ర ఎన్నికల సంఘం (జుజ×), ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - SIR) ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ

(మిగతా 2వ పేజీలో..)

## పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన

**ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**ఓట్లు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా మీ ముందుకే తెస్తానన్న పొన్నం**

**ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని రాంచందర్ రావు డిమాండ్**



తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా

(మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# సం పా దకీయం

## యువతకు ఉపాధి భరోసా.. నైపుణ్యాలే భవిష్యత్తుకు మార్గం!

దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువతలోనే ఉంది. చదువుకున్న యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించినప్పుడే కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయి. సమాజం అభివృద్ధి చెందుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది. అయితే నేటి పరిస్థితుల్లో డిగ్రీలు పూర్తిచేసినప్పటికీ ఉద్యోగం దొరకక ఇబ్బందులు పడుతున్న యువత పెద్ద సంఖ్యలో కనిపిస్తోంది. మరోవైపు కొన్ని రంగాల్లో తగిన నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులు దొరకడం లేదనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రెండింటి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం విద్యా వ్యవస్థ, ప్రభుత్వాలు, పరిశ్రమల ముందున్న ప్రధాన సవాలు.

డిగ్రీతో పాటు నైపుణ్యాలు అవసరం

ఒకప్పుడు పట్టా పొందితే ఉద్యోగం లభిస్తుందనే నమ్మకం ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. విద్యార్హతలతో పాటు ఆచరణాత్మక పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, బృందంగా పనిచేసే లక్షణాలు ఉద్యోగాల్లో కీలకంగా మారాయి. అందువల్ల విద్యార్థులు చదువుతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలి.కంప్యూటర్ పరిజ్ఞానం, డేటా విశ్లేషణ, అకౌంటింగ్, డిజిటల్ మార్కెటింగ్, సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఉపాధి అవకాశాలను విస్తరించగలదు. అయితే అందరికీ ఒకే విధమైన శిక్షణ అవసరం లేదు. విద్యార్హతలు, ఆసక్తులు, స్థానిక ఉపాధి అవకాశాలను బట్టి శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలి.

విద్యాసంస్థలు--పరిశ్రమల మధ్య అనుసంధానం

విద్యాసంస్థల్లో నేర్చుకునే అంశాలు, ఉద్యోగ రంగాల్లో అవసరమయ్యే నైపుణ్యాల మధ్య అంతరం ఉన్నప్పుడు యువతకు సమస్యలు ఎదురవుతాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కళాశాలలు పరిశ్రమలతో కలిసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, వృత్తి ఆధారిత కోర్సులు, ప్రత్యక్ష అనుభవానికి ప్రాధాన్యం ఇవ్వాలి.కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధానానికి పరిమితం కాకుండా విద్యార్థులు వాస్తవ సమస్యలకు పరిష్కారాలు కనుగొనేలా ప్రోత్సహించాలి. చదువు పూర్తయ్యే సమయానికి ఉద్యోగానికి అవసరమైన ప్రాథమిక సామర్థ్యాలు అలవడితే యువతలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

గ్రామీణ యువతకు సమాన అవకాశాలు

ఉపాధి అవకాశాలు ఎక్కువగా పట్టణాలు, ప్రధాన పారిశ్రామిక కేంద్రాల చుట్టూ కేంద్రీకృతమవుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణ ఖర్చులు, నివాస వ్యయం, భాషా సమస్యలు కొందరికి అదనపు భారంగా మారుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లోనూ నైపుణ్య శిక్షణ కేంద్రాలను బలోపేతం చేయాలి. స్థానిక వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ, చేతివృత్తులు, సేవా రంగాలు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం కల్పించాలి. జిల్లాలవారీగా అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, వాటికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు అభివృద్ధి చేస్తే వలసల ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ ఉద్యోగాలే ఏకైక మార్గం కాదు

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించడం తప్పు కాదు. అయితే వాటి కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తూ ఇతర అవకాశాలను పూర్తిగా విస్మరించడం యువతకు నష్టదాయకంగా మారవచ్చు. ప్రైవేట్ రంగం, వృత్తి ఆధారిత ఉద్యోగాలు, స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, ఫ్రీలాన్సింగ్ వంటి ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించాలి.స్వయం ఉపాధి వైపు వెళ్లాలనుకునే యువతకు ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, లెక్కల నిర్వహణ, డిజిటల్ చెల్లింపులపై శిక్షణ కూడా అవసరం. వ్యాపారం ప్రారంభించడం ఎంత ముఖ్యమో దాన్ని నిలబెట్టుకోవడానికి అవసరమైన పరిజ్ఞానం పొందడం అంతే ముఖ్యం.

జాబ్‌మేళాలు ఫలితాలనివ్వాలి

ఉద్యోగ మేళాలు యువతకు సంస్థలతో నేరుగా పరిచయం ఏర్పరచుకునే అవకాశం కల్పిస్తాయి. అయితే అవి కేవలం కార్యక్రమాలకే పరిమితం కాకూడదు. ఏ సంస్థలు పాల్గొన్నాయి? ఎన్ని ఖాళీలు ఉన్నాయి? ఎంతమంది ఎంపికయ్యారు? ఎంపికైనవారికి నిజంగా ఉద్యోగాలు లభించాయా? అనే వివరాలను సేకరించి సమీక్షించాలి.ఉద్యోగార్థులకు రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, వృత్తిపరమైన ప్రవర్తనపై ముందస్తు శిక్షణ అందిస్తే జాబ్‌మేళాల ప్రయోజనం పెరుగుతుంది. ఉద్యోగం రాని అభ్యర్థులకు ఏ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలో సూచనలు అందించాలి. అప్పుడు ఒక్కసారి జరిగే కార్యక్రమం కూడా భవిష్యత్తులో ఉపాధి సాధనకు ఉపయోగపడుతుంది.

మహిళల ఉపాధికి ప్రత్యేక దృష్టి

విద్యావంతులైన మహిళలు కుటుంబ బాధ్యతలు, ప్రయాణ సమస్యలు, సురక్షితమైన పని ప్రదేశాల కొరత, నైపుణ్య శిక్షణకు పరిమిత అవకాశాలు వంటి కారణాలతో ఉపాధికి దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయి. మహిళలకు నైపుణ్య శిక్షణ, సురక్షిత రవాణా, అవసరమైన చోట అనువైన పని విధానాలు, స్వయం ఉపాధికి సహాయం అందుబాటులో ఉండాలి.మహిళల ఆర్థిక స్వావలంబన కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా సమాజంలో వారి నిర్ణయాధికారాన్ని కూడా పెంచుతుంది. అందువల్ల ఉపాధి విధానాల్లో మహిళల అవసరాలను ప్రత్యేకంగా పరిగణించాలి.

నైపుణ్య శిక్షణ నాణ్యతపై పర్యవేక్షణ అవసరం

శిక్షణ పేరుతో కోర్సులు నిర్వహించడం మాత్రమే సరిపోదు. వాటి ద్వారా ఉద్యోగాలు లభిస్తున్నాయా? నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకునే అవకాశం ఉందా? శిక్షణ కేంద్రాల్లో అవసరమైన పరికరాలు, నిపుణులు ఉన్నారా? అన్న అంశాలను పరిశీలించాలి. ఉద్యోగాల సంఖ్యను పెంచడంతో పాటు నాణ్యమైన, గౌరవప్రదమైన పని పరిస్థితులను కల్పించడం కూడా అవసరం.

యువతే దేశ అభివృద్ధికి చోదకశక్తి

యువతకు ఉపాధి కల్పించడం కేవలం ఆర్థిక అంశం కాదు. నిరుద్యోగం వల్ల ఆత్మవిశ్వాసం తగ్గడం, కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి పెరగడం, నైపుణ్యాలు ఉపయోగించుకునే అవకాశాలు కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే ఉపాధి విధానాలు విద్య, శిక్షణ, పరిశ్రమల అభివృద్ధి, వ్యాపార ప్రోత్సాహం వంటి అంశాలతో అనుసంధానమై ఉండాలి.యువత చేతిలో డిగ్రీ ఉండటం అవసరం.. ఆ డిగ్రీకి తగిన నైపుణ్యం, ఆ నైపుణ్యానికి తగిన అవకాశం లభించడం అంతకంటే ముఖ్యం. ప్రభుత్వాలు ఉద్యోగావకాశాలను పెంచాలి, విద్యాసంస్థలు నైపుణ్యాలను తీర్చిదిద్దాలి, పరిశ్రమలు యువతకు అవకాశాలు కల్పించాలి. యువత కూడా నిరంతరం నేర్చుకుంటూ మారుతున్న కాలానికి అనుగుణంగా తమను తాము మెరుగుపరుచుకోవాలి. ఉపాధి భరోసా బలపడినప్పుడే యువశక్తి దేశాభివృద్ధికి సంపూర్ణంగా ఉపయోగపడుతుంది.

# ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?: ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

# ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

మొదటి పేజీ తరువాయి)

'ఇండియా' కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 11 మంది సీనియర్ నేతలు సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఏ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నాయకురాలు మహువా మాఝీ, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈ.టీ. మహ్మద్ బషీర్ పిటిషనర్లుగా ఉన్నారు. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు రావలసి ఉంది.అంతకుముందు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌కు లేఖ రాశామని, అయితే అధికారికంగా పిటిషన్ ద్వారా కోర్టును ఆశ్రయించాలని ఆయన సూచించారని రాహుల్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమతో కలిసి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టారు.

విపక్షాల ఆరోపణలు నిరాధారం: బీజేపీ

'ఇండియా' కూటమి ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ వివాదాన్ని విపక్షాలు రాజకీయ ప్రదర్శనగా మార్చాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గురు ప్రకాశ్ పాశ్వాన్ విమర్శించారు. ఆయన ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ, "విపక్షాల ఆరోపణలు పూర్తిగా నిరాధారం. వారు అబద్ధాలు చెబుతున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చింది" అని స్పష్టం చేశారు. అస్సాంలోని సిల్చార్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్‌లలో బ్యాలెట్ పేపర్లతో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని, దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓడిపోతున్నందునే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# ఇది ఓట్ల దొంగతనమే: మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి)

పాల్పడుతోందని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేస్తామని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు.ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ను అడ్డుపెట్టుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని, ఇది ఓట్ల దొంగతనమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఈసీని పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హిందుస్థాన్ టైమ్స్, పీటీఐ కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓట్లు తొలగించడం దారుణమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 'ఓట్ బచావో, దేశ్ బచావో' నినాదంతో ఈ దేశవ్యాప్త ఆందోళనను కాంగ్రెస్ ఉద్ధృతం చేసింది.

# 'ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది'..

మొదటి పేజీ తరువాయి)

రద్దు చేస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'కమిటీ సిఫార్సుల ఆధారంగా, నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేశారు. నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానం అనే మూడు కొత్త ప్రదేశాలను నిర్దేశించారు' అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మూడు కొత్త ప్రదేశాలలో నిరసనలు నిర్వహించడానికి సంబంధించిన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాలను వేర్వేరుగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మరోవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్) వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలను ఉధృతం చేశాయి. దీంతో గత రెండు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్కడకు చేరుకుంటున్న నిరసకారులను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ గుర్తింపును రద్దు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

# 'సింహాసనం ఖాళీ చేయండి.. ప్రజలు వస్తున్నారు'.. శశి థరూర్ సంచలన పోస్ట్!

మొదటి పేజీ తరువాయి)

పోస్ట్ చేశారు. మరో పోస్టులో రాహుల్ గాంధీ చేసిన 'ఈ ప్రభుత్వం దిగిపోతుంది' అనే వ్యాఖ్యనూ పంచుకున్నారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ అక్టోబర్ 10న జరిగిన నిరసన సందర్భంగా పోలీసులు హింసకు పాల్పడ్డారని, బీజేపీ కార్యకర్తలు విద్యార్థులు, మహిళలపై దాడులు చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనలను నిరసిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి ఢిల్లీలో ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైంది. గత వారం రోజులుగా రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నిరసనలు కొనసాగిస్తోంది.ఇటీవలి నిరసనల్లో శశి థరూర్ చురుగ్గా పాల్గొనకపోవడం గమనార్హం. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వైఖరికి కొన్ని అంశాల్లో ఆయన మద్దతు పలికారు. ముఖ్యంగా 2025 మేలో భారత్-పాకిస్థాన్ మధ్య నాలుగు రోజుల పాటు సాగిన సైనిక ఘర్షణకు సంబంధించిన 'ఆపరేషన్ సిందూర్' విషయంలో ప్రభుత్వ వైఖరిని సమర్థించారు. అలాంటి థరూర్ ఇప్పుడు ప్రతిపక్షాల నిరసనలకు మద్దతుగా పరోక్షంగా స్పందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన

మొదటి పేజీ తరువాయి)

సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు.ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ (ా×=) ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు... ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (ాపీఖీదీ) పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్.. టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (ఎ+జూ) ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు.టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# నల్గొండ రెడ్‌క్రాస్‌కు తొలి మహిళా చైర్‌పర్సన్

**హేమలత ప్యానెల్‌కు 8 స్థానాలు.. అమరేందర్ రెడ్డి ప్యానెల్‌కు 7...**

**కీలక పదవులకు ఏకగ్రీవ ఎంపిక.. కొత్త కార్యవర్గంపై సేవాభిమానుల ఆశలు...**

**నల్గొండ, అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి:**

నల్గొండ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో నూతన నాయకత్వం కొలువుదీరింది. సుమారు 12 ఏళ్లుగా ఎన్నికలు లేకుండా కొనసాగుతున్న నిర్వహణ వ్యవస్థకు ఈసారి ఎన్నికలతో మార్పు వచ్చింది. ఆదివారం నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికలు జరగ్గా, సోమవారం కీలక పదవుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. సొసైటీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత ఎన్నికై చరిత్ర సృష్టించారు. నల్గొండ రెడ్‌క్రాస్ సొసైటీకి తొలి మహిళా చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

రెండు ప్యానల్ల మధ్య హోరాహోరీ పోటీ!

రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ఎన్నికల్లో డాక్టర్ హేమలత నేతృత్వంలోని నల్గొండ సేవా సమితి ప్యానెల్, గోలి అమరేందర్ రెడ్డి ప్యానెల్ పోటీ పడ్డాయి. మొత్తం 1,385 30 ఓట్లు ఇన్వాయిడ్ అయ్యాయి. మంది ఓటర్లు ఉండగా, 32 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అక్టోబర్ 11న నిర్వహించిన పోలింగ్‌లో 1,003 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం చేపట్టిన ఓట్ల లెక్కింపులో 15 మంది నిర్వహణ కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఫలితాల్లో డాక్టర్ హేమలత నేతృత్వంలోని నల్గొండ సేవా సమితి ప్యానెల్‌కు 8 స్థానాలు దక్కగా, గోలి అమరేందర్ రెడ్డి ప్యానెల్‌కు 7 స్థానాలు లభించాయి. దీంతో రెండు ప్యానల్ల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది. ఒక్కో విడత ఓట్ల లెక్కింపు వెలువడుతున్న కొద్దీ అభ్యర్థులు, వారి మద్దతుదారుల్లో ఉత్కంఠ నెలకొంది.

పది నిమిషాల్లోనే ఏకగ్రీవ ఎంపిక!

నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికల అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, ట్రెజరర్ తదితర కీలక పదవుల ఎంపికపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. సోమవారం నిర్వహించిన ఈ ప్రక్రియలో నామినేషన్ల దాఖలుకు పది నిమిషాల గడువు కేటాయించారు. ఆయా పదవులకు పోటీగా ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత, వైస్ చైర్‌పర్సన్‌గా భీమనపల్లి శ్రీకాంత్, ట్రెజరర్‌గా కుంభం



జ్యోతి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మంచుకొండ చిన్న బిక్షమయ్య ఎంపికయ్యారు.

సేవల విస్తరణపై ఆశలు.!

కొత్త కార్యవర్గం ఏర్పాటుతో నల్గొండ రెడ్‌క్రాస్ సొసైటీలో సేవా కార్యక్రమాలు మరింత విస్తరిస్తాయనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తనిధి సేవలు, పేదలకు వైద్య సహాయం, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలను బలోపేతం చేయాల్సిన బాధ్యత కొత్త కమిటీపై ఉంది. ఎన్నికల ప్రక్రియ ద్వారా ఏర్పడిన నూతన కార్యవర్గం పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ, సభ్యుల సహకారంతో సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సేవాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. తొలి మహిళా చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత ఎన్నిక కావడం ఈసారి ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది...రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ ప్రేమ్ కుమార్, జిల్లా సహకార అధికారి మమత తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికలతో పాటు కీలక పదవుల ఎంపిక ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేసినట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గం రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించి, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణికి 102 ఫిర్యాదులు







**ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి: అదనపు కలెక్టర్లు**

**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 102 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అదనపు కలెక్టర్లు కిరణ్మయి (లోకల్ బాడీస్), చంద్రారెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 49, ఇతర శాఖలకు సంబంధించి 53, మొత్తం 102 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నిరసనల్లో పాల్గొనడంపై చర్యలు తీసుకోవాలి






**జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి**

**నల్లగొండ, అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ రాజకీయ స్వరూపం కలిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న వారిపై సేవా నియమావళి ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అక్టోబర్ 10న నల్లగొండ గడియారం సెంటర్‌లో యూటీఎఫ్, డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారని, ప్రధాన ఎన్నికల కమిషనర్ లిజ్ఞానేశ్‌కుమార్‌లి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సేవా నియమావళికి విరుద్ధంగా రాజకీయ స్వరూపం కలిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారనే అంశంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులుగా తేలిన వారిపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ ఇటువంటి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని బీజేపీ ఖండిస్తోందని నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. నిరసన కార్యక్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు జిల్లా యంత్రాంగం, జిల్లా కలెక్టర్ నుంచి బీఎల్‌ఓల వరకు అధికారులపై నిరసన వ్యక్తం చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొంటున్న వ్యక్తుల ఫొటోలను ఆధారాలుగా వినతిపత్రానికి జత చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లికళ్యాణ్ నాయక్, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక లింగస్వామి, సతీష్ యాదవ్, సైదులులి తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడిగా ఎన్నికైన శ్రీ పరమాత్మ గారికి అభినందనలు: పాలకూరి రవి గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు

**నల్గొండ అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి:**



నల్గొండలో ఫార్మసీ రంగంలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న శ్రీ పరమాత్మ గారు నల్గొండ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించి సభ్యుడిగా నియామక పత్రాన్ని అందుకోవడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు పాలకూరి రవి గౌడ్ పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో విశేష అనుభవం కలిగిన శ్రీ పరమాత్మ గారు ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం న్యాయపరంగా పోరాటం చేయడం ప్రశంసనీయమన్నారు. వైద్యులు రాసే ప్రిస్క్రిప్షన్‌లలో అక్షరాలు స్పష్టంగా ఉండాలని, మందుల విషయంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే లక్ష్యంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించి చేసిన పోరాటం ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశమని తెలిపారు. అదేవిధంగా రైలు ప్రయాణాల్లో మధ్య బెర్తు వినియోగం కారణంగా తోటి ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్లి, ఉదయం 6 గంటల తర్వాత ప్రయాణికుల సౌకర్యార్థం మధ్య బెర్తును మూసివేసే నిబంధనకు సంబంధించి మార్పుల కోసం ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సత్యం, ధర్మం, అహింస వంటి విలువలకు ప్రాధాన్యతనిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నల్గొండలో మంచి గుర్తింపు సంపాదించుకున్న శ్రీ పరమాత్మ గారు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడిగా ఎన్నిక కావడం సంతోషకరమని పాలకూరి రవి గౌడ్ అన్నారు. ఆయనకు లభించిన ఈ అవకాశం ద్వారా సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ పరమాత్మ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని పాలకూరి రవి గౌడ్ ఆకాంక్షించారు.

## ఎల్‌నినో నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**8 నెలల పాటు జాగ్రత్తలు పాటించాలి: వ్యవసాయ శాఖ అధికారులు**

**అలియాబాద్, అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి:**



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సోమవారం అలియాబాద్ రైతు వేదికలో రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతం లోటు వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లిఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రానున్న లిలి8 నెలల పాటు రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలనిలి సూచించారు. పంటల సాగులో నీటి పొదుపు చర్యలు, అందుబాటులో ఉన్న నీటి వనరుల సద్వినియోగం, పంటల ఎంపిక తదితర అంశాలపై రైతులకు అధికారులు వివరించారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి రమేష్, ఉద్యాన అధికారి వెంకట్ రమణ, పశు వైద్య అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులులి తదితరులు పాల్గొన్నారు. పలువురు రైతులు కార్యక్రమంలో పాల్గొని ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పొందారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**అధికారులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశం**

**మేడ్చల్-మల్కాజిగిరి అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో కలిసి అదనపు కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 88



దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చిన అర్జీదారుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి, వేగవంతంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో 38 మంది బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ -- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు:

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ..**

**నల్గొండ జిల్లా అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి:**

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్, బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 38 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రతి బాధితుడి ఫిర్యాదును జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల స్వభావాన్ని బట్టి చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా, ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్, సంబంధిత అధికారులకు సూచించారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
ఏ. నవీన్ కుమార్ గౌడ్

# చిట్యాల పోలీస్ స్టేషన్ ను సందర్శించి తనిఖీ చేసిన ఐజీ షాహనవాజ్ ఖాసిం ఐపిఎస్





## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**చిట్యాల పట్టణం అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి:**

చిట్యాల పోలీస్ స్టేషన్‌ను యాదాద్రి జోన్ ఐజీ షాహనవాజ్ ఖాసిం సందర్శించి, పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఐజీ వెంట ఉన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు, బాలల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఐజీ షాహనవాజ్ ఖాసిం గారు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సావధానంగా విని చట్టప్రకారం సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, బాధితులకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగించేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు.చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐజీ గారు సూచించారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనదారులకు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి క్షతగాత్రులకు సకాలంలో వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పోక్సో () చట్టం కింద నమోదయ్యే కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐజీ తెలిపారు. బాలలపై లైంగిక నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే చట్టప్రకారం స్పందించి, బాధిత బాలబాలికలకు అవసరమైన రక్షణ, భరోసా కల్పించాలని సూచించారు. బాధితుల గోప్యతను కాపాడుతూ, నిబంధనల ప్రకారం సున్నితంగా విచారణ చేపట్టాలని, సంబంధిత కేసుల్లో శాస్త్రీయ ఆధారాలు సేకరించి నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. బాలలపై నేరాలు జరగకుండా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించేలా చైతన్యం కల్పించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు, ఇళ్ల దొంగతనాలు, వాహనాల చోరీలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐజీ సూచించారు. గతంలో దొంగతనాలు జరిగిన ప్రాంతాలు, నేరాలు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు సీసీ కెమెరాల వినియోగాన్ని ప్రోత్సహించాలని, నేరస్తుల కదలికలను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. దొంగతనాల కేసుల్లో నిందితులను గుర్తించేందుకు పక్కా ఆధారాలు సేకరించి, చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని సూచించారు.రౌడీషీటర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, పునరావృత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలతో సమన్వయం పెంచుకుంటూ, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తూ, దర్యాప్తులను వేగవంతం చేయాలని, నేరాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించాలని ఐజీ ఆదేశించారు. కోర్టు కేసుల్లో సాక్షుల హాజరు, సమన్ల అమలు, చార్జిషీట్ల దాఖలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేరస్తులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ, విధుల్లో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని తెలిపారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లా పోలీస్ శాఖ తరపున రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, దొంగతనాల అరికట్టడం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐజీ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచి, పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఐజీ షాహనవాజ్ ఖాసిం. సూచించారు. ఈ తనిఖీలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్‌తో పాటు నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి చిట్యాల సీఐ సురేష్, ఎస్.ఐ వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనాలను కాంక్షించేలా ఫోర్త్ ఎస్టేట్ ఉండాలి

- జర్నలిస్టులు సమాజ సేవకు అంకితం కావాలి: మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్‌రెడ్డి



**నల్లగొండ, అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రజా ప్రయోజనాలను పరిరక్షించేలా ఫోర్త్ ఎస్టేట్ పనిచేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజల పక్షాన నిలుస్తూ, ప్రజల మనోభావాలు, ప్రయోజనాలను ప్రతిబింబించే విధంగా జర్నలిజం ఉండాలని ఆయన సూచించారు.తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా





నాగార్జునసాగర్ పరిధిలోని జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సోషల్ మీడియాలి అంశాలపై సోమవారం నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కే. శ్రీనివాస్‌రెడ్డి జర్నలిస్టులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే వ్యవస్థగా పత్రికా వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. జర్నలిస్టులు సమాజ సేవకు అంకితం కావాలని, ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంతో పాటు వారిలో చైతన్యం తీసుకురావడం మీడియా బాధ్యత అని అన్నారు. ప్రజల మనోభావాలను మీడియా ప్రతిబింబించలేకపోతే ప్రజలకు మీడియాపై నమ్మకం కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.సమాజంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల తర్వాత లినాలుగో స్థానం జర్నలిజానికిలి ఉందని, ఈ ప్రత్యేక స్థానాన్ని జర్నలిస్టులు బాధ్యతాయుతంగా నిలబెట్టుకోవాలని కోరారు.వర్కింగ్ జర్నలిస్టులు, జర్నలిస్టులకు సంబంధించిన చట్టాలు, పత్రికలు--యాజమాన్యం మధ్య సంబంధాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియా మధ్య వ్యత్యాసాలు, జర్నలిజం చట్టాలు, మార్గదర్శక సూత్రాలు తదితర అంశాలను ఆయన జర్నలిస్టులకు వివరించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఫ్యాక్ట్ చెకర్, ఏఐ ట్రైనర్ సత్యప్రియలి శిక్షణ ఇవ్వగా, లిసామాజిక మాధ్యమాలపై ముద్దం నరసింహస్వామిలి శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి లిఎన్. వెంకటేశ్వరరావు, నల్లగొండ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు లిలియు. వెంకటేశ్వర్లు, జర్నలిస్టుల జిల్లా సంఘం అధ్యక్షులు లిలికృష్ణారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్డీ లిలిరహమాన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లిలిరాజశేఖర్, మీడియా అకాడమీ పీఆర్వో లిలిశైలేశ్వర్‌రెడ్డిలి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగార్జునసాగర్, నందికొండ, దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు మీడియా అకాడమీ చైర్మన్ లికే. శ్రీనివాస్‌రెడ్డినిలి శాలువాలు, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు.

## ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలి

**తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్లగొండ, అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి**

ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, రానున్న 300 రోజుల పాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.సోమవారం పగిడిమర్రి గ్రామంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో సాగునీటి లభ్యత పరిమితంగా ఉన్నందున చెరువులు, కాలువలు, బోరుబావుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన మేరకే నీటిని వినియోగిస్తూ నీటి వృథాను అరికట్టాలని అన్నారు.భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పెసర, మినుము, కంది, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు పరస్పరం చర్చించుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై తమ అభిప్రాయాలను తెలియజేస్తే, వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. పండ్లు, కూరగాయల సాగు వంటి ప్రత్యామ్నాయాలపైనా రైతులు దృష్టి సారించాలని కోరారు.వచ్చే ఏడాది జూన్, జూలై నెలల వరకు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, సమష్టి కృషితో నీటి ఎద్దడిని అధిగమించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకం పనులను వినియోగించుకొని కూలీలు జీవనోపాధి పొందవచ్చని తెలిపారు.రైతులకు అవసరమైన స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పరికరాల వివరాలను తెలియజేస్తే ప్రభుత్వ సహకారంతో వాటిని సమకూర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఐదు రైతు క్లస్టర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి శేఖర్, ట్రాన్స్‌కో ఎస్ఈ, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, సర్పంచ్ నాగవెల్లి నాగమణి సైదులు, ఏఈఓ కీర్తన, జగల్ రెడ్డి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 15వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**సూర్యాపేట పట్టణం అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి:**

సూర్యాపేట పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ తెలంగాణ వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, మాజీ డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది డీసీసీ అధ్యక్షులుగుడిపాటి నర్సయ్య.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ, అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించి, పట్టణ అభివృద్ధికి కృషి చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, రాష్ట్ర, జిల్లా,పట్టణ, వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## హరిహర ప్రీమియర్ లీగ్ సీజన్--4 విజేతగా హరిహర లయన్స్

**రన్నరప్‌గా హరిహర జైంట్స్.. విజేతలకు ట్రోఫీ అందజేసిన శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ఎండీ యాదవ రెడ్డి**

**పీర్జాదిగూడ, స్పోర్ట్స్ న్యూస్:**

తూర్పు హైదరాబాద్‌లో ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణ సంస్థ శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరిహర ప్రీమియర్ లీగ్ (హెచ్‌హెచ్‌పీఎల్) సీజన్--4 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో హరిహర లయన్స్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలవగా, హరిహర జైంట్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.హరిహర గ్రూప్‌కు చెందిన వివిధ గేటెడ్ కమ్యూనిటీల నివాసితుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతోపాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన నాలుగో సీజన్ పోటీలు క్రీడాభిమానులను ఆకట్టుకున్నాయి. లీగ్ దశలో ప్రతిభ కనబరిచిన జట్లు ఫైనల్‌కు చేరుకోగా, ఆదివారం జరిగిన తుది పోరులో హరిహర లయన్స్, హరిహర జైంట్స్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో హరిహర లయన్స్ విజయం సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అప్పిడి యాదవ రెడ్డి విజేత హరిహర లయన్స్ జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేసి క్రీడాకారులను అభినందించారు. రన్నరప్‌గా నిలిచిన హరిహర జైంట్స్ జట్టును సైతం అభినందించారు.ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ, హరిహర గ్రూప్ పరిధిలోని వివిధ గేటెడ్ కమ్యూనిటీల నివాసితుల మధ్య స్నేహపూర్వక పరిచయాలను పెంపొందించడం, పరస్పర సంబంధాలను బలోపేతం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే హరిహర ప్రీమియర్ లీగ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, సమష్టి భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నివాసితులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా భవిష్యత్తులో మరిన్ని క్రీడా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. హరిహర ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు హరి రెడ్డి, విజేత హరిహర లయన్స్ జట్టు





కెప్టెన్ రాజశేఖర్ వర్మ, వైస్ కెప్టెన్ అమర్ సింహ, టోర్నమెంట్ నిర్వాహకులు సైదులు గౌడ్, వినయ్ రెడ్డి, రమేష్ రెడ్డి, చేతన్, ప్రవీణ్ రెడ్డి, నర్సయ్య, సురేందర్‌తోపాటు వివిధ జట్ల క్రీడాకారులు, హరిహర గ్రూప్ గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హరిహర ప్రీమియర్ లీగ్ కేవలం క్రికెట్ పోటీలకే పరిమితం కాకుండా, వివిధ కమ్యూనిటీల కుటుంబాల మధ్య స్నేహసంబంధాలు, ఐక్యత, సమష్టి భావనను పెంపొందించే వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## భారత్--జపాన్ స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలి

**హైదరాబాద్, అక్టోబర్ 12 నేటి వెలుగు ప్రతినిధి**

భారత్--జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, తెలంగాణ రాష్ట్రం, జపాన్‌లోని హిరోషిమా ప్రాంతాల మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించుకోవాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆకాంక్షించారు.జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధుల బృందం సోమవారం తెలంగాణ శాసనసభను సందర్శించింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఇరు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు, అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. జపాన్ ప్రతినిధుల బృందానికి తెలంగాణ శాసనసభ తరఫున ఘన స్వాగతం పలికారు.పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యంఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారత్, జపాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఫార్మా, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణ, హిరోషిమా ప్రాంతాల మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో జపాన్ పెట్టుబడులు పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు.హిరోషిమా నగరం రెండో ప్రపంచ యుద్ధంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొన్నప్పటికీ శాంతి, పునర్నిర్మాణం, అభివృద్ధికి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, సామరస్యం, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు దేశాల మధ్య పరస్పర సహకారం కీలకమని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, వివిధ దేశాల శాసనసభల మధ్య జరిగే సమావేశాలు శాసన ప్రక్రియలు, పరిపాలనా విధానాలు, ప్రజాస్వామ్య విలువలపై పరస్పర అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. హైదరాబాద్‌కు జపాన్‌లోని మియోషి నగరంతో ఉన్న సోదర నగర సంబంధాలు ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక, సామాజిక అనుబంధానికి నిదర్శనమని పేర్కొన్నారు.అధునాతన సాంకేతిక రంగాల్లో విస్తృత అవకాశాలుశాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ భారత్, జపాన్ దేశాలు ప్రజాస్వామ్య విలువలు, శాంతి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. తెలంగాణ, హిరోషిమా ప్రాంతాల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు, విద్య, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, పరిశోధన, పారిశ్రామిక రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జపాన్ పారిశ్రామిక సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ముఖ్యంగా ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాల్లో జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని, తెలంగాణ మానవ వనరులను సమన్వయం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.తెలంగాణ శాసనసభ, హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ మధ్య సభా నిర్వహణ, శాసనసభ కమిటీల పనితీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాల్లో అనుభవాలను పంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణుల పరస్పర మార్పిడి కార్యక్రమాలను విస్తరించాలని ఆకాంక్షించారు.జపాన్ నుంచి క్రమశిక్షణ, సమయపాలన, సాంకేతిక నైపుణ్యం, విపత్తుల నిర్వహణ వంటి అంశాల్లో నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయని స్పీకర్ పేర్కొన్నారు. హిరోషిమా పునర్నిర్మాణ ప్రయాణం శాంతి, సహనం, మానవత్వం ద్వారా అభివృద్ధి సాధ్యమని ప్రపంచానికి చాటిచెబుతోందని అన్నారు. ఈ సమావేశం తెలంగాణ, జపాన్ ప్రాంతాల మధ్య భవిష్యత్తు సహకారానికి బలమైన వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి, జపాన్ ప్రతినిధుల బృందం సభ్యులు, శాసనసభ, శాసన మండలికి చెందిన ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Published and owned by PAMANAGUDNDLA NAVEEN KUMAR, Printed at SRI printers at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, PAMANAGUDNDLA NAVEEN KUMAR : RNI No. TELTEL 2023/88559, Cell : 9553276552,